సంక్షేమమే శ్వాసగా సీఎం జగన్ పాలన



సభలో పాల్గొన్న జనం



సభలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ

- లబ్ధి చేకూర్చిన వారికే ఓటు వేయండి
- 15వ వార్డులో మేము సిద్ధం–మా బూత్ సిద్ధం సభలో ఎంపీ ఎంవీవీ

మద్దిలపాలెం : పేదల సంక్షేమమే శ్వాసగా రాష్ట్రంలో ఐదేళ్ల పాటు సీఎం జగన్ పాలన సాగించారని వైఎస్సార్‌సీపీ విశాఖ తూర్పు నియోజకవర్గం అసెంబ్లీ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. జీవీఎంసీ 15వ వార్డులో మేము సిద్ధం–మా బూత్ సిద్ధం సభ మంగళవారం కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య ఆధ్వర్యంలో సింహాద్రిపురంలో జరిగింది. ఈ సందర్భంగా ఎంవీవీ మాట్లాడుతూ లబ్ధి చేకూర్చిన వారికే ఓటు వేసి గెలిపించాలన్నారు. రాష్ట్రంలో సుదీర్ఘ పాదయాత్ర చేపట్టి ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి అనువుగా మేనిఫెస్టోను రూపొందించిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. ఆ మేనిఫెస్టోను ఒక భగవద్గీత, ఖురాన్, బైబిల్‌గా భావించారన్నారు.

రాష్ట్రంలో విద్య, వైద్య రంగాల అభివృద్ధి అద్భుతంగా జరిగిందన్నారు. దేశంలో తొలిసారిగా సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టి, రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వ సేవలు చేరువ చేశారని చెప్పారు. వార్డులో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. చంద్రబాబు కళ్లబొల్లి కబుర్లతో ప్రజలను మోసం చేయడానికి వస్తున్నారన్నారు. స్థానిక ఎమ్మెల్యేగా మూడు సార్లు ఎన్నికైన వెలగపూడి ఇసుమంతమైన అభివృద్ధి చేయలేదన్నారు. రానున్న ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో వెలగపూడిని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. మోసం చేసిన చంద్రబాబుకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ సైనికుల వలే పనిచేసి వైఎస్సార్‌సీపీ గెలుపునకు బాటలు వేయాలని కోరారు.

ఈ సభలో వైఎస్సార్‌సీపీ నాయకులు అప్పారి గిరిబాబు, పీలా వెంకట్, గ్రామ ముస్లిం పెద్దలు ఎంవీవీని గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పి.వెంకట నారాయణ, తూర్పు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు, వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జోనల్ అధ్యక్షుడు అల్లంపల్లి రాజుబాబు, బోని శివరామకృష్ణ, జేసీఎస్ కన్వీనర్ పీలా ప్రేమ్‌కిరణ్, వెంకటలక్ష్మి, ఇన్‌చార్జిలు, డైరెక్టర్లు, మండల అధ్యక్షులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణానికి వేళాయె

- శ్రీరామ నవమికి ఆలయాలు ముస్తాబు
- ప్రత్యేక ఏర్పాట్లు చేసిన ఉత్సవ కమిటీలు



పూజలకు సిద్ధమైన ఆరిలోవ దుర్గాబజార్‌లో రామాలయం

ఆరిలోవ: శ్రీరామనవమి ఉత్సవాలకు తూర్పు నియోజకవర్గంలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. సీతారాముల కల్యాణ మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆరిలోవ ప్రాంతంలో రామాలయాలు, విఘ్నేశ్వరస్వామి ఆలయాలు, ఆంజనేయస్వామి గుడులు, వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో కమిటీల సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయాల వద్ద తాటి, కొబ్బరి కమ్మలతో పందిళ్లు వేశారు. విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేశారు. పైనాపిల్ కాలనీ, దుర్గాబజార్, పెదగదిలి, సింహగిరి కాలనీ, ఎస్ఐజీ నగర్, ఇందిరానగర్, విశాలాక్షినగర్‌లలో రామాలయాలు, హనుమంతవాక వద్ద కోదండ రామాలయం, వెటర్నరీ కాలనీ, శ్రీహరినగర్, భరత్‌నగర్‌లలో వెంకటేశ్వరస్వామి ఆలయాలు, శ్రీకాంత్‌నగర్‌లో ఆంజనేయస్వామి ఆలయం, చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయం, తదితర ఆలయాలను శ్రీరామ నవమి పూజలు కోసం మంగళవారం సిద్ధం చేశారు. ఆయా ఆలయాల్లో సీతారామ కల్యాణం కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. కల్యాణం అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్న సమారాధన నిర్వహించనున్నారు.

ఎన్నికల బాధ్యతలు పక్కాగా నిర్వహణ



మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

మహారాణిపేట: త్వరలో జరగనున్న ఎన్నికల్లో వివిధ శాఖల అధికారులకు కేటాయించిన బాధ్యతలను పక్కాగా నిర్వర్తించాలని తూర్పు అసెంబ్లీ ఆర్వో, జేసీ కె.మయూర్ అశోక్ అన్నారు. మంగళవారం తన చాంబర్‌లో నోడల్ అధికారులతో ఎన్నికల సన్నద్ధతపై జేసీ సమీక్షించారు. అనంతరం నోడల్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ నెల 18న ఎన్నికల నోటిఫికేషన్ జారీ అవుతుందని, ఆ రోజు నుంచి అభ్యర్థుల నామినేషన్లు స్వీకరణ జరుగుతుందన్నారు. రానున్న నెల రోజు చాలా కీలకమన్నారు. అధికారులు బాధ్యతతో పని చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని, ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తాగునీరు, విద్యుత్, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో నోడల్ అధికారి విజయలక్ష్మి, డీఎస్‌వో సూర్యప్రకాశరావు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

18, 19 తేదీల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ జోన్–3 పరిధిలోమంచినీరు సరఫరా చేసే 600 ఎంఎం డయా జీఆర్‌పీ పంపింగ్ మెయిన్ పైపులైన్ మరమ్మతులకు గురైన సందర్భంగా తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని జీవీఎంసీ మంచినీటి సరఫరా విభాగం కార్య నిర్వాహక ఇంజినీర్ ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల కారణంగా 18, 19 తేదీల్లో పలు ప్రాంతాల్లో మంచినీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని చెప్పారు. ఈ నెల 18న 16వ వార్డులోని (కొంత భాగం) కేఆర్ఎం కాలనీ, శివాలయం, 17వ వార్డులో ఆదర్శనగర్, ఎంవీపీ కాలనీ సెక్టార్–8, 19వ వార్డు పెదజాలారిపేట, ఎల్‌బీ కాలనీ, ఎంవీపీ కాలనీ సెక్టార్–12, 20వ వార్డులో చినవాల్తేర్, ఈస్ట్‌పాయింట్ కాలనీ, పెదవాల్తేర్ ప్రాంతాలకు మంచినీటి సరఫరాలో అంతరాయం ఏర్పడనుందన్నారు. అలాగే 19న 22వ వార్డులోని (కొంత భాగం), న్యూరేసపువానిపాలెం, పిఠాపురం కాలనీ, పిఠాపురం వుడా క్వార్టర్స్, పీతలవానిపాలెం, శివాజీపాలెం, 23వ వార్డులోని (కొంత భాగం), మద్దిలపాలెం, ఆటోమొబైల్ రోడ్డు, కృష్ణా కాలేజీ రోడ్డు, మద్దిలపాలెం ఆర్‌టీసీ డిపో రోడ్డు, గాయత్రి స్కూల్‌రోడ్డు, పెద్దనుయ్యి ప్రాంతం, 24వ వార్డులోని చైతన్య నగర్ తదితర ప్రాంతాల్లో తాగునీటికి అంతరాయం ఏర్పడనుందన్నారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా ట్యాంకర్ల ద్వారా మంచినీరు సరఫరా అవుతుందన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

సమష్టి కృషితోనే వైఎస్సార్‌సీపీ గెలుపు



మాట్లాడుతున్న పల్లా దుర్గారావు

బీచ్ రోడ్డు: ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చే విధంగా అందరం కలిసి సమన్వయంతో పని చేయాలని 28వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పల్లా దుర్గారావు కోరారు. మంగళవారం జీవీఎంసీ 28వ వార్డు కార్పొరేటర్ పల్లా అప్పలకొండ ఆధ్వర్యంలో బూత్ కన్వీనర్లు, గృహసారథులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ గత ఐదేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. వైఎస్సార్‌సీపీ గెలుపు లక్ష్యంగా కష్టపడాలని పిలుపునిచ్చారు.

ఘనంగా నూకాలమ్మ మారువారం పండగ



ప్రత్యేక అలంకరణలో నూకాలమ్మ

ఆరిలోవ: రూరల్ తహసీల్దారు కార్యాలయం సమీపంలో కొలువుదీరిన నూకాలమ్మ అమ్మవారి మారువారం పండగ మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అమ్మవారి విగ్రహాన్ని నూతన వస్త్రాలు, పూలమాలలతో అలంకరించారు. డెయిరీ ఫారం, ఇందిరానగర్, వెటర్నరీ కాలనీ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. డీఈవో ఎల్.చంద్రకళ ఆలయానికి వెళ్లి అమ్మవారికి పూజలు చేశారు.

1.1 లక్షల నగదు పట్టివేత

బీచ్ రోడ్డు: సరైన పత్రాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.1.10 లక్షల నగదును ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ పట్టుకుంది. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మంగళవారం ఏయూ ఇంజినీరింగ్ కాలేజ్ రోడ్డులో ఎస్.సురేష్ అనే వ్యక్తి కారులో అటుగా రావడంతో పోలీసులు తనిఖీ చేశారు. అందులో రూ.1.10 లక్షల నగదును గుర్తించారు. ఎటువంటి పత్రాలు లేకపోవడంతో పోలీసులు నగదును స్వాధీనం చేసుకుని మూడో పట్టణ పోలీసు స్టేషన్‌కు అప్పగించారు.

మద్యం స్వాధీనం

బీచ్ రోడ్డు: అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని మూడో పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. మంగళవారం బీచ్ రోడ్డులో వెంకట సాయి ప్రసాద్ అనే వ్యక్తి కారులో అక్రమంగా మద్యం బాటిళ్లను తీసుకెళ్ల దాన్ని పోలీసులు గుర్తించి తనిఖీలు చేశారు. నాలుగు బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకుని, పోలీసులు కేసు నమోదు చేశారు.

సంఘ సంస్కర్త కందుకూరి



కందుకూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కృష్ణా కళాశాల అధ్యాపకులు



ప్రసంగిస్తున్న విభాగాధిపతి ఆచార్య అప్పారావు

ఏయూ క్యాంపస్: సంఘ సంస్కర్త, దార్శనికుడు కందుకూరి వీరేశలింగం అని ఏయూ తెలుగు విభాగాధిపతి ఆచార్య జర్ర అప్పారావు అన్నారు. మంగళవారం విభాగంలో కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి కార్యక్రమం జరిగింది. ముందుగా కందుకూరి చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ యుగకర్తగా, స్ఫూర్తి ప్రదాతగా కందుకూరి నిలుస్తారన్నారు. విభాగ ఆచార్యులు వెలమల సిమ్మన్న మాట్లాడుతూ తాను నమ్మిన సిద్ధాంతం కోసం ఎన్నో కష్టాలను కందుకూరి అనుభవించారన్నారు. తన జీవితాన్ని, ఆస్తిని ప్రజల కోసం వెచ్చించారని కొనియాడారు. డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు ఆచార్యుడు డాక్టర్ పి.గోపాల నాయుడు మాట్లాడుతూ రచన, పత్రికా రంగాలను నిర్వహిస్తూ సమాజ సంస్కరణ చేసిన అభ్యుదయవాదిగా కందుకూరిని కొనియాడారు. ఆయన జన్మదినాన్ని తెలుగు నాటకరంగ దినోత్సవంగా జరుపుకొంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఈశ్వరమ్మ, బి.వెంకటస్వామి, కె.రత్నశేఖర్, పి.లావణ్య, డాక్టర్ వెంకటేశ్వర్లు, పరిశోధక విద్యార్థులు, స్నాతకోత్సవ విద్యార్థులు పాల్గొన్నారు.

కృష్ణా కళాశాలలో..

మద్దిలపాలెం : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల తెలుగు విభాగం, జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని కందుకూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, ఎన్ఎస్ఎస్ అధికారి పి.ఉమామహేశ్వరరావు, శ్యామూల్ డేవిడ్‌రాజ్, తెలుగు అధ్యాపకుడు గోపాల్‌నాయుడు పాల్గొన్నారు.

రైఫిల్ షూటింగ్‌లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: క్రీడల్లో ప్రతిభ చూపిన ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థులను వీసీ ఆచార్య ప్రసాద రెడ్డి మంగళవారం తన కార్యాలయంలో అభినందించారు. రైఫిల్ షూటింగ్‌లో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపి, జాతీయ స్థాయి ఎంపికలకు వెళుతున్న ఏయూ మహిళా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని పి.జాయ్ సి, ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ విద్యార్థి పి.ఎమ్మి రతన్‌లను వీసీ తన కార్యాలయంలో అభినందించారు. వీరిద్దరూ ఇటీవల హైదరాబాద్‌లో ఆదర్శ కళానిలయం నుంచి ఉగాది బంగారు నంది పురస్కారాలు అందుకున్నారు. భవిష్యత్తులో జాతీయ స్థాయిలో సైతం ప్రతిభ చూపి వర్సిటీకి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని వీసీ ఆకాంక్షించారు. రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్, మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కె.భట్టి, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, విద్యార్థి వ్యవహారాల డీన్ విజయ్ మోహన్, ఆచార్య ప్రజ్ఞ పాల్గొన్నారు.

సంక్షేమ పాలనను ఓటుతో ఆశీర్వదించండి

- వైఎస్సార్‌సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ
- వార్డుల్లో పార్టీ శ్రేణులతో కలిసి విస్తృత ప్రచారం



19వ వార్డులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ తూర్పు అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ



పాత వెంకోజీపాలెంలో ప్రచారం చేస్తున్న తూర్పు ఎన్నికల పరిశీలకుడు అప్పారావు



17వ వార్డు ఆదర్శనగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సత్యవతి తదితరులు

ఎంవీపీ కాలనీ: విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ ఎన్నికల ప్రచారం మంగళవారం 19వ వార్డులో జోరుగా సాగింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా 90వ రోజు 19వ వార్డు పెదజాలరిపేటలో పార్టీ శ్రేణులతో కలిసి ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమాన్ని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న ప్రజారక్షక పాలనను వివరించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున తనను తూర్పు ఎమ్మెల్యేగా, ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఎంవీవీకి ప్రతి ఇంటా ఓటర్లు నీరాజనాలు పలికారు. హారతులు పడుతూ ఎంవీవీని స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ సంక్షేమ పాలనను ఓటుతో ఆశీర్వదించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు ఇన్‌చార్జి సూరాడ వెంకటలక్ష్మి, సూరాడ దాసు, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శనగర్‌లో..

ఎంవీపీకాలనీ: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలపాలని కోరుతూ 17వ వార్డు ఆదర్శనగర్‌లో ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పిల్లా సత్యవతి ఆధ్వర్యంలో పలువురు మహిళలు ఇంటింటి ప్రచారం చేశారు. ఐదేళ్ల పాలనలో ప్రతి ఇంటికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మంచిని వివరించడంతో పాటు పేదల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అందించిన పాలనపై అవగాహన కల్పించారు. 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వానికి, 2019లో అధికారంలోకి వచ్చిన జగనన్న ప్రభుత్వానికి మధ్య తేడాను ఓటర్లు గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. తూర్పు ఎమ్మెల్యేగా ఎంవీవీ సత్యనారాయణను, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించాలని కోరారు.

పాత వెంకోజీపాలెంలో..

మద్దిలపాలెం : జీవీఎంసీ 16వ వార్డు పాత వెంకోజీపాలెంలో వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు పార్టీ నాయకులతో కలిసి విస్తృత ప్రచారం చేశారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి పార్టీ విశాఖ ఎంపీ అభ్యర్థి డాక్టర్ బొత్స ఝాన్సీ, తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. పాత వెంకోజీపాలెం, గుడివారి వీధిలో ఇంటింటికి వెళ్లికి కరపత్రాలు అందజేశారు.




13వ వార్డులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు కెల్ల సత్యనారాయణ



10వ వార్డు వివేకానందనగర్‌లో ప్రచారం చేస్తున్న విద్యా విభాగం డైరెక్టర్ పతివాడ వెంకటలక్ష్మి, తదితరులు

ఆరిలోవ: తూర్పు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. నియోజకవర్గంలో అన్ని వార్డుల్లోనూ బూత్‌ల వారీగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, బీఎల్‌ఏలు ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. మంగళవారం జీవీఎంసీ 9, 10, 11, 12, 13 వార్డుల్లో ప్రచారం చేస్తూ కరపత్రాలు అందించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ, విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేయాలని కోరారు. ఈ ప్రచారాలతో వార్డుల్లో సందడి నెలకొంది.

విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహిస్తాం




నాటికలు ప్రదర్శించిన విద్యార్థులను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించే విధంగా తగిన అవకాశాలు కల్పిస్తామని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద రెడ్డి అన్నారు. మంగళవారం ఏయూ అకడమిక్ సెనేట్ మందిరంలో అంబేడ్కర్ చైర్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంబేడ్కర్ జయంత్యుత్సవాల్లో భాగంగా లఘు నాటికల్లో పాల్గొని ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి వీసీ మాట్లాడుతూ విద్యార్థులే వర్సిటీకి బ్రాండ్ అంబాసిడర్లని చెప్పారు. విద్యార్థుల్లో విభిన్న సృజనాత్మక కళలు ఉన్నాయని, వాటిని నిరంతరం ప్రోత్సహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ప్రిన్సిపాళ్లు ఆచార్య కె.శ్రీనివాసరావు, జి.శశిభూషణరావు, వి.విజయలక్ష్మి, ఎస్.కె.భట్టి, టి.శోభశ్రీ, వై.రాజేంద్రప్రసాద్, కె.విశ్వేశ్వరరావు, నరసింహారావు, ఎన్.విజయ్‌మోహన్ పాల్గొన్నారు.

అధ్యాపకులకు శిక్షణ

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నోడల్ రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో సింగిల్ మేజర్ సబ్జెక్ట్స్‌పై ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు సంబంధించి ఎకనామిక్స్ అధ్యాపకులు హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ మంజుల మాట్లాడుతూ 2023 విద్యా సంవత్సరం నుంచి డిగ్రీ విద్యార్థులకు సింగిల్ మేజర్ సిస్టం ప్రవేశపెట్టారని, ఈ నెల 22 వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు.

ముగిసిన నాటిక ప్రదర్శనలు



ఇంద్రప్రస్థం నాటికలో ఓ సన్నివేశం

మద్దిలపాలెం : విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో మద్దిలపాలెం కళాభారతిలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి నాటిక పోటీలు మంగళవారం ముగిశాయి. ఆఖరి రోజు ఇంద్రప్రస్థం నాటికను గుంటూరుకు చెందిన అభినయ ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించారు. ప్రతి సన్నివేశాన్ని ఎంతో చక్కగా అభినయం చేసి నటీనటులు ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ మాట్లాడుతూ చక్కని కథాంశంతో ఎంతో అద్భుతంగా నటీనటులు వారి పాత్రలకు న్యాయం చేశారని ప్రశంసించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వీఎండీఏ అధ్యక్షుడు ఎం.ఎస్.ఎన్.రాజు, పైడా కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలుగా ఆచార్యులు బాబీవర్ధన్, కె.జి.వేణు వ్యవహరించారు.

అక్రమ అడ్మిషన్లు అరికట్టాలని వినతి

మద్దిలపాలెం : ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ అడ్మిషన్లతో పాటు, వేసవి తరగతులు నిర్వహిస్తున్నారని, వీటిని అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నాగారాజు కోరారు. ఈ మేరకు మంగళవారం కోరుతూ ఇంటర్మీయట్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి(ఆర్ఐవో) మురళీధర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. నిబంధనలు పాటించని కళాశాలలపై నిఘా పెట్టి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సభ్యులు కిరణ్, శేఖర్, అర్జున్ పాల్గొన్నారు.